క్లుప్తంగా

సౌత్ క్యాంపస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సునీతకు డాక్టరేట్

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లోని కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న గొర్కటి సునీత డాక్టరేట్ పట్టా సాధించారు. ఉస్మానియా యూనివర్సిటీలో లోహ సమ్మేళనాలతో నానో పార్టికల్ తయారీ–వాటి ధర్మాలు, ఉపయోగాలు, వివరాలు పరిశోధనలను కమిటీ ముందు వివరించి డాక్టరేట్ పట్టాను పొందారు. 15 ఏళ్లుగా సునీత సౌత్ క్యాంపస్ కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. డాక్టరేట్ పట్టాను సాధించిన సునీతను సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకరగౌడ్‌తో పాటు ప్రొఫెసర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్లు సోమవారం అభినందించారు.

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మద్నూర్(జుక్కల్): ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సోమవారం జహీరాబాద్ పార్లమెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మద్నూర్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేశారు. ఈ నెల 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ కొనసాగుతుందని, ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

బిచ్కుందలో పోలీస్ సిబ్బంది..



బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద సీఐ నరేష్, ఎస్సై మోహన్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి సోమవారం బిచ్కుందలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ వేశారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా విధులలో చేరుతున్న పోలీసు అధికారులు, సిబ్బందికి ఓటు వేయడానికి పోస్టు బ్యాలెట్ పత్రాలను ఎన్నికల అధికారులు అందించారు.

పోలింగ్ కేంద్రం తనిఖీ

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని గిర్నితండా గ్రామ పంచాయతీలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సోమవారం ఎంపీడీవో గంగాధర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన తాగునీటి సదుపాయంతో పాటు విద్యుత్తు, ఫ్యాన్లను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శిరీష, ఫీల్డ్ అసిస్టెంట్ గంగారాం తదితరులు ఉన్నారు.

విద్యార్థినులకు సన్మానం




భిక్కనూరు: పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన ముదిరాజు విద్యార్థినులను మండల ముదిరాజు ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. నంద సాహితీ, ఉప్పరి గీతాంజలి, బత్తుల నందిని, బత్తుల సింధూజ, బత్తుల స్వాతి, గుండె వైష్ణవిలను శాలువాలు, మెమెంటోలు, నగదు బహుమతులతో సత్కరించారు. ముదిరాజు ఉద్యోగుల సంక్షేమ సంఘం మండల గౌరవ అధ్యక్షులు గజ్జెల భిక్షపతి, నంద రమేష్, మండల అధ్యక్షుడు గంగళ్ల స్వామి, ప్రతినిధులు పాల్గొన్నారు.

‘గొర్రెల పెంపకందారులను మభ్య పెట్టారు’

కామారెడ్డి అర్బన్: కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పదేళ్లుగా గొర్రెలు, మేకల పెంపకందారులకు ఆర్థిక సహాయం పేరిట అరచేతిలో స్వర్గం చూపి మభ్యపెట్టడం తప్ప జరిగిన మేలు ఏమీలేదని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా గొర్రెలు మేకలు పెంపకందారుల సహకార సంఘం మాజీ డైరెక్టర్ మచ్చ రాజయ్య ఆరోపించారు. దేవునిపల్లికి చెందిన మచ్చ రాజయ్య, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

రెడ్డి సంఘం సభ్యుల చేరిక



మాచారెడ్డి: పాల్వంచ మండలం వాడి గ్రామానికి చెందిన రెడ్డి సంఘం సభ్యులు 80 మంది రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో పాల్వంచ మండల శాఖ అధ్యక్షుడు రమేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

రోడ్డు పనులకు మోక్షం ఎప్పుడో ?

- సెంట్రల్ లైటింగ్, రోడ్డుకు రూ.12 కోట్ల నిధులు మంజూరు
- 6 నెలల క్రితం నిలిచిన పనులు
- ఇద్దరు ఎమ్మెల్యేలు.. రెండు సార్లు శంకుస్థాపన
- ప్రమాదకరంగా మారిన గుంతలు



ప్రమాదకరంగా ఉన్న గుంతలు



మురికి కాలువలు లేక రోడ్డుపై పారుతున్న మురికి

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ పనులు ఆరు నెలల నుంచి నత్తనడకన కొనసాగుతున్నాయి. ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడు లభిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 2 కిలో మీటర్ల రోడ్డుకు రూ.12 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న హన్మంత్ సింధే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. బిచ్కుంద అభివృద్ధిలో ముందుకు దూసుకెళ్తుందని, సెంట్రల్ లైటింగ్ వస్తోందని ప్రజలు ఆనంద పడ్డారు. నియోజకవర్గంలో ఎక్కడా సెంట్రల్ లైటింగ్ లేదు.. బిచ్కుందలో పనులు ప్రారంభం కావడంతో ఎన్నో ఏళ్ల కల నెరవేరబోతుందని ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. అధికారులు 49 ఫీట్లకు మార్కింగ్ ఇచ్చారు. కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపులా మోకాళ్ల వరకు గుంతలు తవ్వి వదిలేశారు. ఎన్నికలు ముగియగానే కాంట్రాక్టర్ పనులు చేయనని చేతులు ఎత్తేసి వెళ్లిపోయారు. గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఆరు నెలల నుంచి వాహనదారులు అప్పడప్పుడు గుంతలలో పడి గాయాలపాలవుతున్నారు. కొత్త ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రత్యేక చొరవ తీసుకొని ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి రీ టెండర్ వేయించారు. వర్షాకాలం రాకముందు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం చేపట్టి రోడ్డు పనులు ప్రారంభించాలని సూచించారు. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు మార్చి 10న పనులకు శంకుస్థాపన చేశారు. మూడు నెలలవుతున్నా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికి ఇద్దరు ఎమ్మెల్యేలు రెండు సార్లు శంకుస్థాపన చేశారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉంది పరిస్థితి. రోడ్డు తవ్వి వదిలేయడంతో వరదలా రోడ్డుపై మురికి నీరు ప్రవహిస్తున్నాయి.

దుకాణాల్లోకి వెళ్తున్న వర్షపు నీరు

వానా కాలంలో వర్షపు నీరు బయటకు వెళ్లడానికి మురికి కాలువలు లేకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా తవ్విన గుంతలలో నిల్వ ఉండి పక్కనే ఉన్న దుకాణాల్లోకి వెళ్తున్నాయి. మోకాళ్ల వరకు వర్షపు నీరు నిలువ ఉంటున్నాయి. ప్రజలు, వ్యాపారస్తులు ఎన్నో అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభానికి నెల రోజులే ఉండడంతో వ్యాపారస్తులు భయాందోళన చెందుతున్నారు. కనీసం డ్రైనేజీ పనులు చేపట్టి వర్షపు నీరు బయటకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రజాప్రతినిధులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. ఆర్అండ్‌బీ ఏఈ వినోద్‌ను వివరణ కోరగా టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేయడానికి ముందుకు రావడం లేదన్నారు.

మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యం

రామారెడ్డి(ఎల్లారెడ్డి): మానసిక వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తామని మానసిక వైద్య నిపుణులు జి రమణ అన్నారు. మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యమన్నారు. సోమవారం సదాశివనగర్ మండల కేంద్రంలో మానసిక ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రిలో మానసిక వ్యాధిగ్రస్తులకు చికిత్స చేసి, అవగాహన కల్పించినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఆస్మా తెలిపారు. అలాగే ప్రతి నెలా సదాశివనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మానసిక వ్యాధిగ్రస్తులకు సేవలు అందిస్తారని చుట్టుపక్కల మండలాలు, గ్రామాల వారు వినియోగించుకోవాలని తెలిపారు. మానసిక వైద్య నిపుణులు జి రమణ మాట్లాడుతూ..మానసిక సమస్యలున్న వారు చికిత్స తీసుకోవాలన్నారు. వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 14416ని సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సైకియాట్రిక్ సోషల్ వర్కర్ రాహుల్ కుమార్, సీహెచ్‌వో నాగరాజు, సూపర్‌వైజర్ లీలావతి పాల్గొన్నారు.



రోగికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమణ

వన నర్సరీ పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని గిర్నితండా గ్రామ వన నర్సరీని సోమవారం ఎంపీడీవో గంగాధర్ పరిశీలించారు. వన నర్సరీలో చెట్ల మధ్యన ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శిరీష, ఫీల్డ్ అసిస్టెంట్ గంగారాం తదితరులున్నారు.

కాంగ్రెస్ నేతల ఇంటింటి ప్రచారం



చిట్యాలలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



తిప్పాపూర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



జిల్లా కేంద్రంలోని 31వ వార్డులో.. జ్ఞానేశ్వరి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి, చిట్యాల, కరడ్‌పల్లి, బ్రహ్మాజీవాడి, చందాపూర్, సంగోజీవాడి, సంతాయిపేట్, ఎండ్రియాల్, క్రిష్టాజీవాడి, నందివాడ తదితర గ్రామాలలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి తిరుగుతూ చేతి గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ రవి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రావు, పులి బాబు, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని పలు వార్డులో కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులు సోమవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. 31వ వార్డులో కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి, కౌన్సిలర్లు నాయకులు కరపత్రాలు పంపిణీ చేస్తూ చేతి గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను వేడుకున్నారు.

మాచారెడ్డి: గజ్యానాయక్ తండా శివారులోని ఉపాధి హామీ పని పథకం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు అలీఖాన్, బన్సిలాల్, గణేష్ నాయక్, నరేష్, ప్రకాష్ నాయక్, తదితరులున్నారు.



గజ్యానాయక్ తండా శివారులో..

దోమకొండ: మండల కేంద్రంలో సోమవారం జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ కూమార్తె గిరిజా షెట్కార్‌తో పాటు పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు దోమకొండలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, జెడ్పీటీసీ తిరుమల గౌడ్, నాయకులు ఐరన్ నరసయ్య, నర్సారెడ్డి, శంకర్ రెడ్డి తదితరులున్నారు.

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో కాంగ్రెస్ నేతలు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీంరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు ధర్మయ్య, మాజీ సర్పంచ్ నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ

బాన్సువాడ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏకకాలంలోనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందని కోనాపూర్ మాజీ సర్పంచ్ వెంకటరమణారావు అన్నారు. సోమవారం ఆయన కోనాపూర్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేపట్టారు.

బాన్సువాడ : పట్టణంలోని ఆయా కాలనీల్లో కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి ఓటర్లకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మోరెల్ శ్రీనివాస్‌రావు, నార్ల రత్నకుమార్, కొత్తకొండ భాస్కర్, తదితరులు ఉన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న గిరిజా షెట్కార్



కోనాపూర్‌లో..



బాన్సువాడ టీచర్స్ కాలనీలో..

జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



రాజంపేట: రైతులు జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్గొండ సొసైటీ సీఈవో సాయిలు సూచించారు. సోమవారం ఆర్గొండ సొసైటీ పరిధిలోని కొండాపూర్ గ్రామంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.3,180 కల్పిస్తుందని, రైతులు తమ పటాద్దారు పాసు బుక్కు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లను సంబంధిత ఏఈవోకి అందించి జొన్నలను విక్రయించుకోవాలని తెలిపారు. ఏఈవో మౌనిక, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రియాంక గాంధీ సభను విజయవంతం చేయాలి



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 10న జరిగే ప్రియాంక గాంధీ సభను విజయవంతం చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇలియాస్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలో భారీ ఎత్తున యువత, కార్యకర్తలు సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఐరేని సందీప్, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు గోదావరిఖనిలో ఆటో డ్రైవర్ల రాష్ట్ర మహాసభ

కామారెడ్డి అర్బన్: ఆటో కార్మికుల సమస్యలపై నేడు(మంగళవారం) మధ్యాహ్నం ఒంటి గంటకు గోదావరిఖని ఆర్ఆర్ గార్డెన్స్‌లో ఆటో కార్మిక హక్కుల సాధన రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆటో జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోదాసు నర్సింలు తెలిపారు. ఆటో కార్మికులకు సంబంధించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణంతో ఉపాధి లేక మృతి చెందిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.25లక్షల ఆర్థిక సహాయం, నెలకు రూ.12 వేల పెన్షన్ తదితర డిమాండ్లతో మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సెప్టెంబర్‌లో బ్రహ్మ కుమారీస్ నేషనల్ మీడియా కాన్ఫరెన్స్

కామారెడ్డి అర్బన్: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం మీడియా వింగ్, రాజయోగా ఎడ్యుకేషన్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 26 నుంచి 30 వరకు రాజస్తాన్ మౌంట్‌అబు, ఆనంద్‌సరోవర్‌లో నేషనల్ మీడియా కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి జయదీదీ తెలిపారు. ఐదు రోజుల నేషనల్ మీడియా కాన్ఫరెన్స్‌లో అనేక అంశాలపై అవగాహన, రాజయోగా శిక్షణ, ప్రదేశాల వీక్షణం ఉంటుందన్నారు. ఆసక్తిగల జర్నలిస్టులు 93965 23442 నంబర్‌కు సంప్రదించవచ్చన్నారు.

సమన్వయంతో పని చేసి బీజేపీని గెలిపించాలి

- మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు



సమావేశమైన మాజీ మంత్రి ఆంజనేయులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి రాబోయే లోక్‌సభ ఎన్నికలలో బీజేపీని గెలిపించాలని మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి రాంరెడ్డి అన్నారు. కాలోజీవాడి, బ్రాహ్మణపల్లి, సంగోజీవాడి, చందాపూర్, కన్‌కల్, కరడ్‌పల్లి గ్రామాలలో సోమవారం బూత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 10 సంవత్సరాలు ప్రధాన మంత్రి మోదీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రజలు బీజేపీ వైపు మొగ్గుచూపుతున్నారన్నారు. బీబీ పాటిల్ ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తని, అందరిని కలుపుకుపోయే గుణం ఉన్నవాడన్నారు. నాయకులు, కార్యకర్తలు గ్రామాలలో తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై ప్రజలకు వివరించి పువ్వు గుర్తుకు ఓటు వేసేలా చూడాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు హోటల్ శ్రీనివాస్, నాయకులు యాదగిరి, నర్సారెడ్డి, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రధాని అయితేనే దేశం సుభిక్షం



ఉపాధి కూలీల వద్ద ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



భిక్కనూరులో



తుంకిపల్లిలో..



పిట్లంలో ..

లింగంపేట(ఎల్లారెడ్డి): నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి అయితేనే దేశం సుభిక్షంగా ఉంటుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు రామకృష్ణ గుప్తా అన్నారు. సోమవారం ఆయన లింగంపేట మండలం కంచుమల్, కొండాపూర్ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి నరేంద్ర మోదీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. అలాగే ఉపాధి కూలీల వద్దకు వెళ్లి మోదీ చేసిన అభివృద్ధిని వివరించారు. నాయకులు నరేష్, గణేష్, రవీందర్, శుభాష్, తదితరులు పాల్గొన్నారు.

మోదీ హ్యాట్రిక్ ప్రధాని కావడం ఖాయం

భిక్కనూరు: నరేంద్ర మోదీ మూడో సారి ప్రధాని పదవిని అధిష్టించి హ్యాట్రిక్ సాధించడం ఖాయమని బీజేపీ భిక్కనూరు మండల అధ్యక్షుడు ఉప్పరి రమేశ్ అన్నారు. సోమవారం ఆయన భిక్కనూరు మండల కేంద్రంలో జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. బీజేపీ నేతలు అరిగే నర్సింలు, నవీన్, ప్రవీణ్, సురేష్, గంగారాం పాల్గొన్నారు.

ఊపందుకున్న బీజేపీ ప్రచారం

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్, నిజాంసాగర్ మండలాల్లోని పలు గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల నాయకులు, కార్యకర్తలు గడప, గడపకు తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమ తమ పార్టీల మేనిఫెస్టోను వివరిస్తూ ఓటు వేయాలని కోరుతున్నారు.

ఇంటింటి ప్రచారం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలో బీజేపీ పార్టీ నాయకులు సోమవారం ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ నాయకులు అశోక్‌రాజ్ మాట్లాడుతూ.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి ఎంపీగా బీబీ పాటిల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్ల శివ, తదితరులు పాల్గొన్నారు.

నెమ్లిలో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): నెమ్లిలో సోమవారం గడప గడపకు బీజేపీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు సున్నం సాయిలు మాట్లాడుతూ.. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బీబీ పాటిల్‌ను గెలిపించాలన్నారు. ఆయన వెంట మండల ఇన్‌చార్జి సుధాకర్ గౌడ్, సత్యనారాయణ, సాయిలు తదితరులున్నారు.

ఎల్లారెడ్డి పరిధిలో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని తిమ్మారెడ్డి, తిమ్మారెడ్డితండా గ్రామాలలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి బీజేపీ అభ్యర్థికి ఓటు వేయాలని బీజేపీ నేతలు కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలు, బీజేపీ నాయకులు ఎస్ఎన్‌రెడ్డి, దేవేందర్, బాలికిషన్ తదితరులున్నారు.



నెమ్లిలో..



తిమ్మారెడ్డిలో..

కాంగ్రెస్‌పై భ్రమలు తొలగిపోయాయి



తిప్పాపూర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు



దోమకొండలో..



బొల్లారంలో ..

భిక్కనూరు: కాంగ్రెస్ ప్రభుత్వంపై ఐదు నెలల్లోనే ప్రజలకు భ్రమలు తొలగిపోయాయని ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ ధ్యావర సాయిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన భిక్కనూరు మండలం తిప్పాపూర్‌లో బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తరపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో విండో మాజీ చైర్మన్ వంగేటి చిన్న నర్సారెడ్డి, నేతలు రాజయ్య, బాపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు సోమవారం జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ సీఎంగా చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు గంగ్ర మధుసూదన్‌రావ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, నాయకులు గజవాడ శ్రీకాంత్, బొమ్మెర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని బొల్లారం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.

బస్సుయాత్రను విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డి: కామారెడ్డిలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించే బస్సుయాత్రను విజయవంతం చేయాలని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జలంధర్ రెడ్డి అన్నారు. సోమవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డిలో మంగళవారం నిర్వహించే కేసీఆర్ బస్సు యాత్రకు బీఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.